కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లా కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీకాంత్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్‌గా తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగలక్ష్మికి, జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, ఎన్‌జీఓలు, వివిధ శాఖల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమన్వయంతో ముందుకు వెళ్తాం

ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని సమన్వయంతో పనిచేసి, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు.

తమను నేరుగా కలిసి సమస్యలు ఏవైనా చెప్పుకోవచ్చని సూచించారు. జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రతీఒక్కరూ సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. ఈరోజు 32 వ డివిజన్ లోని తోటపాలెం మౌర్య రెసిడెన్సీ గార్డెన్స్ స్థానికులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అపార్ట్మెంట్ వాసులు డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకుని వచ్చారు. వెంటనే స్పందించిన ఆయన అక్కడున్న సిబ్బందికి సమస్యల పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వీధి దీపాలను తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు ఆదేశించారు. అలాగే రహదారి సౌకర్యాన్ని కల్పించాలని, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డంపర్ బీన్లు ఏర్పాటు చేయాలని ప్రజారోగ్యధికారి డాక్టర్ సత్యనారాయణకు ఆదేశించారు. అనంతరం అపార్ట్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. నగర ప్రజలు వేసిన ఓట్లతో తాము అధికారానికు వచ్చి బాధ్యతగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పెద్దపీట వేసామన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నట్లయితే తనకు సంతృప్తి ఉంటుందని చెప్పారు. మౌర్య అపార్ట్మెంట్స్ ప్రాంతంలో వీధి దీపాలు, డంపర్ బీన్,లు రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

ఈ సమావేశంలో వైసిపి నాయకులు ఎంఎస్ఎన్ రాజు, రవిచంద్ర, మారెం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు,మౌర్య గార్డెన్ అధ్యక్షులు వి.వి.ప్రసాద్, కార్యదర్శి మోహన్ రావు, నగరపాలక సంస్థ డీఈ అప్పారావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణిత ఒలింపియాడ్‌లో వెంకటరమణపేట విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం వెంకటరమణపేట జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు డిసెంబర్-2022లో జరిగిన జాతీయ స్థాయి సైన్సు ఒలింపియాడ్, గణిత ఒలింపియాడ్ లలో చక్కని ప్రతిభ కనబరిచారని హెచ్.ఎం. ఎరికినాయుడు తెలిపారు. ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అభినందన సభలో హెచ్.ఎం మాట్లాడుతూ గుదే పద్మసాయి 5వ తరగతి, యండపల్లి ధనుశ్రీ (5వ తరగతి), కేదారి బంగారు లక్ష్మి (6వ తరగతి), వర్జి సంధ్య (6వ తరగతి), పిల్లా నాగేయపల్లి మోహన్ (8వ తరగతి), దువ్వాడు మౌళిక (8వ తరగతి), వీరు రెండవ స్థాయి పరీక్షలకు అర్హత సాధించారని వెల్లడించారు. విద్యార్థులకు సైన్సు ఒలింపియాడ్‌లో ఇన్చార్జిగా వ్యవహరించిన సూరా ప్రసాదరావు, గణిత ఒలింపియాడ్ ఇన్చార్జి కె.నూకరత్నంలను ప్రధానోపాధ్యాయులు వి.ఎరికినాయుడు అభినందించారు.

సీతంలో "గ్రామరథాన్" మూడవరోజు కార్యశాల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రామరథాన్‌లో భాగంగా ఆఖరిరోజు నిర్వహించిన సదస్సులో ఎల్.ఇ.డబ్ల్యూ.ఎఫ్ అడ్మిన్ ఆర్.యు. నరసింహం, ఎల్.ఇ.డబ్ల్యూ.ఎఫ్ సభ్యుడు ఆర్.వి.జె.నాయుడు పాల్గొన్నారు. ఆర్.యు. నరసిహం మాట్లాడుతూ డబ్ల్యూహెచ్ రూపాలు, భాష రూపాలు, క్రియా విశేషణం, పరిమిత అపరిమిత క్రియలు మొదలైన విషయాలను వివరించారు. మధ్యాహ్నం విభాగంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి శశి భూషణ్ రావు అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వి. రామమూర్తి, ఆంగ్ల అధ్యాపకులు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి: చింతల

విశాలాంధ్ర - రామభద్రపురం: టీడీపీ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎప్పుడు కూడా మంచి గుర్తింపు ఇస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడుగా టీడీపీ తనను నియమించడం జరిగిందని తెలిపారు. పరిశీలకుడుగా నియమించినందున పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. యువ నాయకులు నారా లోకేష్‌కి చంద్రబాబు నాయుడుకి బొబ్బిలి నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి బేబి నాయునకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారు

విశాలాంధ్ర - చీపురుపల్లి: వైసీపీ అసమర్థ పాలనలో ఇబ్బందులు ఎక్కువ అవ్వటం వలన ప్రజలందరూ టీడిపి పాలన కోసం ఎదురుచూస్తున్నారని చీపురుపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లి మండలం పోతయ్య వలస, లక్ష్మి పురం గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో రౌతు కామునాయుడు, దన్నాన రామ చంద్రుడు, మీసాల నవీన్ కుమార్, మీసాల శ్రీధర్, ముల్లు రమణ, దన్నాన సూరప నాయుడు, అరతి సాహు, గవిడి నాగరాజు, శనపతి శ్రీను,కలిశెట్టి సత్యనారాయణ,పొదిలాపు రమణ,రెడ్డి లక్ష్మణరావు, మీసాల యల్లం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణములు పంపిణీ

విశాలాంధ్ర - బొబ్బిలి : విజయనగరం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలిమ్ కో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలు గుర్తింపు శిబిరాన్ని బొబ్బిలి పట్టణంలో గల కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గల విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు కొరకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని వికలాంగులు అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు వికలాంగులకు నూతనంగా మంజూరైన మూడు చక్రాల బల్లును ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు,బొబ్బిలి జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి,కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్, జిల్లా ఉన్నత అధికారులు, నాలుగు మండలాల ఎంపీడీఓలు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధే వైసీపీ లక్ష్యం: వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - భోగాపురం: ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా పరిపాలనా రాజధాని విశాఖపట్టణమేనని ఉత్తరాంధ్రను శరవేగంగా అభివృద్ధి చేస్తామని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కోశాధికారి కందుల రఘు బాబు ఆధ్వర్యంలో బుధవారం భోగాపురంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారెడ్డి మాట్లాడారు. వైసీపీ గృహ సారధులు, కార్యకర్తలు, నాయకులు అందరు రాష్ట్రంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రతీ ఒక్కరిని కలసి వారికి పథకాలు గురించి వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో భోగాపురంను ప్రపంచ పటంలో ముఖ్య నగరంగా తీర్చి దిద్దేందుకు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి వైఎస్ జగన్ మే 3న శంకుస్థాపన చేసిన 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, జిల్లా పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సిఈసి సభ్యులు కాకర్లపూడి శ్రీనువాస రాజు, సౌత్ రైల్వే బోర్డ్ సభ్యులు అంబళ్ళ రాములనాయుడు, మండల పార్టీ ప్రెసిడెంట్ ఉప్పాడ సూర్యనారాయణ, ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి, జడ్పీటీసీ పడాల మంజులత, వైస్ ఎంపీపీలు రావాడ బాబు, పడాల సత్యవతి పాల్గొన్నారు.

భూ సర్వే రాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకంలో భాగంగా తెర్లాం మండలంలోని విజయరాంపురం (నియర్ కొరటాం) రెవెన్యూ గ్రామంలో తహశీల్దార్ డి.రాజేశ్వరావు జగనన్న భూ సర్వే రాళ్లను వివిధ పొలాల హద్దుల్లో పాటించారు. ఈ రాళ్లు భూ సర్వే అనంతరం ఖచ్చితమైన హద్దులను నిర్ణయించిన పిదప పాతిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కొరటాం సర్పంచ్ శ్రీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో మజ్జి

విశాలాంధ్ర - గుర్ల: అన్ని వర్గాల పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గోషాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ వృద్ధులను మహిళలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి, వైయస్సార్ కాపు నేస్తం, ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ అప్పల నాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, సత్యనారా యణ, మీసాల సంతోష్, ఎంపీడీవో కళ్యాణి, తహశీల్దార్ పద్మావతి, వివిధ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా కళాశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఉదయం 22వ వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్.వి.జాషువ జయప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. అంబేద్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగం కోసమే కాకుండా ఉపాధి అవకాశాలు పెంపొందించే స్థాయికి ఎదగాలని కోరారు. ఇంజనీరింగ్ విద్య ఎంతో కీలకమని, విద్యార్థులు భావి ఇంజనీర్లుగా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. వివిధ విభాగల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు,అలాగే ఆటలపోటీల్లో విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టీ.వంశీ మోహన్, అవంతి జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎమ్.లక్ష్మీ ప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యతరగతి ప్రజల కోసం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు

డిప్యూటీ సీఎం రాజన్నదొర

విశాలాంధ్ర - సాలూరు రూరల్: మధ్యతరగతి ప్రజల కోసం జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. సాలూరు బైపాస్ రోడ్‌లో బుడా ఆధ్వరంలో నూతనంగా నిర్మించబోతున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. సామాన్య ప్రజల సొంతింటి కల సాకారానికి జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఉపయోగపడతాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 184 ప్లాట్లతో రెండు లే అవుట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి గాను 14.87 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న 29 మంది రైతుల నుంచి సేకరించామన్నారు. నష్టపరిహారం రూపంలో రైతులకు 2.88 కోట్లు పంపిణీ చేసామ న్నారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ అనేక సంవత్సారాలుగా రైతులు సాగు చేస్తూ ప్రభుత్వ భూమిని కాపాడినందుకు వారికి పరిహారం అందజేశా మన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న లే అవుట్ 1లో 9.47 ఎకరాల విస్తీర్ణంలో 109 ప్లాట్లు, దుగ్గిసాగరం రోడ్డుని ఆనుకొని లే అవుట్ 2లో 5.4 ఎకరాలలో 75 ప్లాట్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో బుడా ఛైర్‌పర్సన్ ఇంటి పార్వతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్‌లు గిరి రఘు, రాపాక మాధవ, పప్పల లక్ష్మణ, గొర్లె వెంకటరమణ, ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన సర్పంచ్‌లు

విశాలాంధ్ర - సాలూరు రూరల్: మండలంలో గిరిశిఖర పంచాయతీలైన డెన్సరాయి, సంపంగిపాడు పంచాయతీలలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మండల టీడీపీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డెన్సరాయి పంచాయతీలో రేవడివలస, మర్రివలస, మూలబడ్డపాడు, సంపంగిపాడు దిగువరూఢి, గాలిపాడు, సుల్లారి గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో టిడిపి మళ్లీ అధికారంలోకి వస్తేనే గిరిజనులకు న్యాయం చేకూరుతుందని ఆమె అన్నారు. ప్రస్తుత పాలక పార్టీ గిరిజనులను చిన్నచూపు చూస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం సర్పంచుల నిధులను స్వాహా చేయడంతో పాటు యస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్ళించి గిరిజనులను మోసం చేస్తుందన్నారు. సంపంగిపాడు సర్పంచ్ గుడియా చంద్రయ్య, డెన్సరాయి సర్పంచ్ మామిడి చిన్నమ్మితో పాటు దాదాపు 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయన్నారు. పార్టీలో చేరిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు వీరయ్య, పొట్టయ్య తదితరులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజన గ్రామాలలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, డ్రైనేజీలు, వంతెనల నిర్మాణాలు చేపట్టి గిరిజన ప్రాంతాలని అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని విస్మరించదని తెలిపారు. సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రాజన్నదొర నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి, ప్రస్తుతం రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు తెదేపా సీనియర్ నాయకులు దొర లక్ష్మణ, కరిబుగత భాస్కరరావు, చోడిపల్లి మాలతీదొర, కోట లక్ష్మణరావు, అక్కాన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రెండవ విడత వై.యస్.ఆర్ ఈబీసీ నేస్తం విడుదల

విశాలాంధ్ర, - పార్వతీపురం: రెండవ విడత ఇబిసి నేస్తం నిధులు బుధవారం విడుదల అయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి వర్చువల్ విధానంలో నిర్వహించిన ఇ.బి.సి నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. వై.యస్.ఆర్. ఈ.బి.సి. నేస్తం పథకంక్రింద 45నుండి 60సంవత్సరాల మధ్య వయస్సుగల ఆర్ధికంగా వెనుకబడిన అగ్రవర్ణ కులాల మహిళలకు రూ.15,000/- చొప్పున ఆర్ధిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. రెండవ విడత (2022-23) క్రింద జిల్లాకు చెందిన 1370 మంది మహిళా లబ్దిదారులకు రూ.2.055 కోట్లు నేరుగా లబ్దిదారులు బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేసారు. మొదట విడత (2021-22) క్రింద 1082 మంది మహిళా లబ్ధిదారులకు 1.623 కోట్లు రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, జిల్లారెవిన్యూ అధికారి జె.వెంకటరావు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మెన్ రంగుముద్రి రమాదేవి, బిసి కార్పొరేషన్ ఏఇఓ గోపి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిల్లలకు పూర్తి స్థాయిలో టీకా నిర్వహణ చేపట్టాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పిల్లలకు పూర్తిస్థాయిలో టీకా నిర్వహణ చేపట్టేందుకు వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణ శివారు ప్రాంతాలను సందర్శించి పిల్లల టీకా కార్డులను పరిశీలించారు. ఈ సందర్బంగా సిబ్బందికి సూచనలు చేశారు. ముఖ్యంగా మురికి వాడలు, శివారు, మూల ప్రాంతాలు, వలస కార్మికులు, సంచార జీవనం గడిపేవారు, ఇటుక బట్టీ, గృహ నిర్మాణ కోసం తాత్కాలిక జీవనం సాగించే ప్రదేశాలు మొదలగు హై రిస్క్ ప్రాంతాలను సిబ్బంది గుర్తించి పై కారణాల వల్ల అక్కడ పిల్లల్లో ఎవరికైనా షెడ్యూలు ప్రకారం వేయబడని టీకా ఉంటే వెంటనే వేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం దుర్గమ్మ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

10 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురానికి పది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నట్లు ఎంఈఓ వి.మల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం 1998 బ్యాచ్లో ఎంపికైన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించారని గురువారం వీరంతా విధుల్లోకే హాజరుకానున్నారని తెలిపారు. మండలంలో మార్కొండపుట్టి పాఠశాలకు ఇద్దరు, చెముడు, ఆల గురువు, బండంగి, బాగుజోల, కే పెద్దవలస, మెట్టవలస, గైసాల, దుగ్గేరు పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయులను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి

విశాలాంధ్ర - సీతానగరం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా అన్నిరకాల ధృవీకరణ పత్రాలను కలిగి ఉండి వాహనాలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా చూపించాలని ఎస్ఐ నీలకంఠం తెలిపారు. బుధవారం స్థానిక హనుమాన్ కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనాలను నిలిపి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటోలో నిర్ణీత ప్రయాణికులను తీసుకొని వెళ్ళాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది అప్పలకొండ, పోలీస్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగిద్దాం

విశాలాంధ్ర - కురుపాం: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయదుందుబి మోగించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నూతనంగా నియమించిన టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేశ్ బాబు అన్నారు. బుధవారం శత్రుచర్ల విజయ రామరాజు నివాసంలో నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో కురుపాం నియోజకవర్గ అత్యవసర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేటి మహేష్ బాబు మాట్లాడారు. టీడీపీ అభివృద్ధి కొరకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జి జగదీశ్వరి మాట్లాడుతూ బూత్ లెవెల్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, క్లస్టర్ ఇన్చార్జిలు అందరూ ఓటర్ వెరిఫికేషన్, హౌజ్ హోల్డ్ మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయిదు మండలాల నాయకులు హాజరయ్యారు.

ఆధునీకరణ పనులను చేపట్టండి: ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని జగన్నాధపురం ప్రాంతంలో గల అతి పురాతన మంచినీటి సరఫరా ట్యాంక్ ఆధునీకరణ పనులకు అవసరమైన అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలో గల జగన్నాధపురం గ్రామం వార్డులలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో ప్రధానంగా ఎర్ర కంచెమ్మ గుడికి ఎదురుగా గల పురాతన మురుగు కాలువలు స్థానంలో ఆధునిక సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నారు. అలానే గుడికి దగ్గరలో గల మంచి నీటి సరఫరా ట్యాంక్‌ను ఆధునీకరించి అభివృద్ధి చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అలానే పాత్రుని కోనేరు సుందరీకరణకు పనులకు అవసరం అయిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ సభ్యులు అర్ చిన్నం నాయుడు, వై.త్రినాథ, ఆర్.బంగారి నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు బి.శ్రీదేవి, స్థానిక వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు జిల్లా ఎస్పీగా పనిచేసిన విద్యాసాగర్ నాయుడుకు విశాఖపట్టణం లా అండ్ ఆర్డర్ డిసిపిగా బదిలీ జరగగా ఆయన ఇక్కడ నుండి మంగళవారం రిలీవ్ అయిన సంగతి తెలిసిందే. కొత్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌కు జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, పార్వతీపురం, పాలకొండ డి.ఎస్పీలు ఏ.సుభాష్, కృష్ణారావు, దిశ డి.ఎస్పి ఎస్ఆర్ హర్షిత, ఏఆర్ డిఎస్పీ నాగేశ్వరరావు, ఎస్బి సీఐ శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ డిఎస్పీ శ్రీనివాసరావు తదితర డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్, ఎస్ఈబి తదితర శాఖల అధికారులు, జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ శాఖల సిబ్బంది స్వాగతం పలికి ఆయనకు పుష్పగుచ్చెంలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకారం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనను మన్యం జిల్లా ఎస్పీగా నియమించినందుకు ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర డిజిపికు కృతజ్ఞతలు తెలిపారు. మన్యం జిల్లాలో గతంలో ఓఎస్డిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో క్రైం, తదితర అంశాలను తెలుసుకున్నారు. సమావేశం ముగిశాక జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని అన్ని కార్యాలయాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

జగనన్నే మా భవిష్యత్‌లో ఎమ్మెల్యే అలజంగి

విశాలాంధ్ర - పార్వతీపురం: సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారంనాడు జరిగిన జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైసీపీ నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వారికి వైసీపీ ప్రభుత్వం చేకూరిన లబ్ధిని, పొందిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, మాజీ జెడ్పీటీసీలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పోలఈశ్వర నారాయణ, ఆర్వీ పార్థసారథి, సర్పంచ్ చింతాడ కృష్ణ, స్టేట్ డైరెక్టర్ ఎస్ తిరుపతి రావు, అంటిపెట ఉపసర్పంచ్ బి తిరుపతి రావు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట పడేనా!

- కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కాసులు కల్ల చూస్తున్న రియల్ వ్యాపారులు
- చోద్యం చూస్తున్న భూగర్భ గనుల శాఖ రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - వేపాడ: వడ్డించేవాడు మనవాడైతే బంతి చివర్లో కూర్చున్న మనకు తిండి దొరుకుతుంది అన్న చందంగా అక్రమ మట్టి తవ్వకందారులు, ట్రాక్టర్ల యజమానులు, రియల్ వ్యాపారుల తీరు తేటతెల్లంగా కనబడుతోంది. అక్రమంగా ప్రభుత్వ భూములలో మట్టి తవ్వకాలు జరుగుతున్నా ఇటు రెవిన్యూ అధికారులు అటు భూగర్భ గనుల శాఖ అధికారులతో అక్రమ మట్టి తవ్వకందారులకు ఉన్న సత్సంబంధాలు ఉండడమేనని బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నాయి. మండలంలోని కరకవలస రెవెన్యూలో ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులను సైతం రియల్ వ్యాపారులు దర్జాగా అక్రమించి తమదైన శైలిలో జెసిబి ప్రొక్లెయినర్‌లతో మట్టి తవ్వకాలను జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి కాసులు కల్ల చూడడమే కాకుండా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కోట్లకు పడగలెత్తుతున్నారు. సర్వే నంబర్ 1లో ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన అధికార వైసీపీ నాయకులు రియల్ వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రొక్లెయినర్‌తో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి దర్జాగా ఏళ్ల తరబడిగా ఉన్నటువంటి జిరాయితి బంధను (ప్యాక్టేరు చెరువు) చెరువులో నీరు బయటకు పోయే విధంగా చేసి కప్పేస్తున్నారు. ఇదే రెవెన్యూలో సర్వే నెంబరు 4-1లో వాగును సర్వే నంబరు 2-1లో ప్రభుత్వ గెడ్డలు సైతం ఆక్రమణలకు గురయ్యాయని ఈ విషయమై గ్రామానికి చెందిన రైతులు పలుమార్లు రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అలాగే అక్రమ మట్టి తవ్వకాలు యదేచ్ఛగా జరుగుతున్నా గ్రామస్థాయిలో ఉన్న రెవిన్యూ అధికారి దృష్టిలో ఉన్నప్పటికీ అక్రమ మట్టి తవ్వకందారులు ఎటువంటి అనుమతులు తీసుకోకపోయినా ఏ చర్యలు చేపట్టలేదని, అలాగే జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులు కూడా ఈ అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారించకపోవడంతో పాలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాల్టా రూపేనా మట్టి తవ్వకాలకు చాలానా కట్టి అధికారులు అనుమతులు పొందిన తర్వాత మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా

అక్రమంగా అక్రమార్కులు మట్టి తవ్వకాలు జరిపిస్తున్నా అధికారులు చొరవ చూపలేదంటే అధికారుల విధులు ఏ విధంగా నిర్వహిస్తున్నారో అర్థమౌవుతుంది. ఈ విషయమై మండల తహశీల్దార్ ఎస్.కృష్ణమరాజుని వివరణ కోరగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు తమ దృష్టికి రాలేదని ప్రభుత్వ భూమల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు చేపడతామన్నారు.

డీఎస్సీ పోస్టుల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1998 డీఎస్సీలో విజయనగరం జిల్లాలో క్వాలిఫై అయిన 504 మందికి గాను ఖాళీగా ఉన్న 489 పోస్టులను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసే ప్రక్రియను లాంఛనంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఏ ముఖ్యమంత్రి 1998 డీఎస్సీ అభ్యర్థుల కోసం ఆలోచించలేదని కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచించి అన్ని అడ్డంకులు తొలగిస్తూ వారికి అండగా నిలిచి పాదయాత్రలో వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నేపథ్యంలో నేడు వారికి ఉద్యోగాలు కల్పిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మీరందరూ ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, డీఈఓ లింగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు గుర్తింపునిస్తాం

విశాలాంధ్ర - గజపతినగరం: జిల్లాలోని బొండపల్లిలో బుధవారం ఉదయం నాయుడు ఫంక్షన్ హాల్‌లో గజపతినగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ కేఏ నాయుడు మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని అన్నారు. ప్రతి ఒక్క బూత్ వాటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేయాలని అన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ రాష్ట్ర పార్టీ పరిశీలకులు సూర్యనారాయణ, అసెంబ్లీ పోలింగ్ కోఆర్డినేటర్ గోపాల్ రాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి బండారు బాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు కోరాడ కృష్ణ, అట్టాడ లక్ష్మీ నాయుడు, కొండపల్లి భాస్కర్ నాయుడు, పెద్దింటి మోహన్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.గోవిందరావు, పార్లమెంట్ కార్యదర్శి కొత్తలి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'చలివేంద్రం' ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గత మూడు రోజులుగా విజయనగరంలో తీవ్రంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాదచారులకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర వాసవీ ఫౌండేషన్ పిలుపు మేరకు జిల్లా వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు లాంతర్ల జంక్షన్ వద్ద 'చలి వేంద్రం' ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు మండవిల్లి వెంకటరాజు తెలిపారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ మజ్జిగ, నిమ్మరసం మొదలగు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ అధ్యక్షుడు తవ్వా మోహనరావు, ప్రాజెక్టు ఛైర్మెన్ రవ్వా వెంకటేశ్వరరావు, కో ప్రాజెక్టు ఛైర్మెన్ తమ్మన మల్లికార్జునరావు, ఫౌండేషన్ కార్యదర్శి ఏడుకొండలు, రాంజీ, శాఖా సత్యన్నారాయణ, బోడా నానాజీ, గుంపిన నారాయణరావు, నరసింహమూర్తి, బందారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం: ఎపి అమరావతి జెఏసి ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్లులో భాగంగా జెఏసి పిలుపు మేరకు పార్వతీపురం మన్యం జిల్లా జెఏసి అధ్యక్షులు గొట్టాపు శ్రీరామమూర్తి, కార్యదర్శి డిజి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎపి అమరావతి జెఏసి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 5వ తేదీ నుండి 29వ తేదీ వరకు రాష్ట్రంలోని అందరు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కొనసాగిస్తారని, అందులో భాగంగా నేడు 26-జిల్లాల ఉద్యోగులు మరియు రిటైర్డ్ ఉద్యోగులు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద వారి సమస్యలపై ధర్నా చేయటం జరిగిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చేపట్టబోతున్న ఈఉద్యమానికి అందరి మద్దతు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా జెఏసి అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాసరావు, రెవెన్యూ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, మునిసిపల్, హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, వర్క్ ఛార్జిడ్ ఎంప్లాయిస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సర్దార్ హస్మి ఆశయ సాధనకు కృషి చేద్దాం

విశాలాంధ్ర - బెలగాం: సర్దార్ హస్మి జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బరావమ్మ మాట్లాడుతూ హస్మి సుప్రసిద్ధ హిందీ నాటిక రచయిత నటుడు దర్శకుడు సిద్ధాంత వేత్త రాజకీయ ఆధునిక

వీధి నాటక ప్రక్రియకు ప్రాణం పోసిన మహనీయుడని అన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలకు ప్రాధాన్య రచనలు వైపే మొగ్గు చూపాడని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ అరిచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఎలా ఆపలేమో ప్రజాకళలను ఆపలేరని హస్మిని చంపినంతమాత్రాన ప్రజా ఉద్యమాలు ప్రజాకళలను ఆపలేరని హస్మి ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు హిమరక రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లంపేట విద్యార్థికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర - బొబ్బిలి: స్థానిక మున్సిపాలిటీలోని మల్లంపేట గ్రామానికి చెందిన పోల రుక్కు మన్మధరావు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. మల్లంపేట గ్రామానికి చెందిన మన్మధరావు అలహాబాద్ ఎంఎన్ఎన్ నిట్ యూనివర్సిటీలో ఎం.టెక్ మెకానికల్ చదివాడు. ఫలితాల్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ స్వాధీనం చేసుకున్నారు. మన్మధరావును లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా అభినందించి గోల్డ్ మెడల్ అందజేశారు. మన్మధరావుకు గోల్డ్ మెడల్ రావడంతో తల్లిదండ్రులు చిన్నతల్లి, శ్రీనివాసరావు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5,738 మందికి ఈబీసీ నేస్తం

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలోని 5,738 మంది ఆర్థికంగా వెనుకబడిన, అగ్రవర్ణాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలకు రెండో విడత ఈబిసి నేస్తం విడుదల అయింది. ఈ పథకంలో భాగంగా ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున మొత్తం రూ.860.70 లక్షల విలువైన చెక్కును లబ్ధిదారులకు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అందజేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రెండో విడత ఈబిసి నేస్తం కార్యక్రమాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో నగదు జమ చేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, ఎపి స్టేట్ రెడ్డిక వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, రాష్ట్ర బిసి యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గొంప అప్పలరాజు, ఎపి నాగవంశం వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, బిసి కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలోని 43వ డివిజన్లో 26.05 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. ప్రారంభ వారోత్సవాలలో భాగంగా ఈరోజు పాల్ నగర్ ప్రాంతంలో రహదారులు ప్రారంభించి ప్రజాభిని యోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వెంటనే వాటి పరిష్కారానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ నాయకులు వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చెం అందజేసారు. వారిద్దరూ కొద్దిసేపు జిల్లాలోని అన్ని అంశాలపై ముచ్చటించారు.

కలెక్టర్‌ని కలిసిన కేసలి అప్పారావు

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్.నాగలక్ష్మిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కేసలి అప్పారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం, రక్షణ సంరక్షణ కోసం అమలు జరుగుతున్న కార్యక్రమాలు గురించి చర్చించారు. నూతన కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.హిమబిందు, సభ్యులు సుధారాణి పట్నాయక్, భవాని, బాలల న్యాయ మండలి సభ్యులు వావిలాపల్లి లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శాంతి కుమారి, సిబ్బంది నాగరాజు, సంధ్య, రూప, తవిటి నాయుడు ఉన్నారు.

కిషోర్‌కు బుడితి పరామర్శ

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు జి.వి.ఆర్. ఎస్.కిషోర్‌కు ఇటీవల పితృవియోగం అయిన విషయం తెలుసుకుని బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పల నాయుడు బెలగాంలోని కిషోర్ స్వగృహంలో కలసి పరామర్శించి రామారావు మాస్టారు చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పాలకొండ డివిజన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కనపాక చౌదరినాయుడు ఉన్నారు.

సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - బొబ్బిలి: సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీ, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలతో మల్లమ్మ పేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏరియాలలో పర్యటించారు. మల్లమ్మ పేటలో కల్లాల వీధిలో ఇటీవల నిర్మించిన కాలువలపై పలకలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మల్లమ్మ పేట పండుగను పురస్కరించుకొని ప్రతి వీధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పండుగ రోజున ప్రత్యేక పారిశుధ్య సిబ్బందితో డ్రైవ్ నిర్వహించి శానిటేషన్ నిర్వహించాలని అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియాలో పర్యటించి కాలువలపై నీటి ప్రవాహానికి వీలు లేకుండా వేసిన పలకలను తొలగించి వాటి స్థానంలో గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాలకు సిద్ధం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ సీఈవో తుమరాడ చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ వైద్య సేవలతో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను తమ క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ ద్వారా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన ప్రముఖ వైద్యుల వైద్య సేవలతో పాటు కొన్నిరకాల మందులు, కొన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అధికారులు, రాజకీయ నాయకులు, పెద్దలు స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తే తమ క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్స్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలకు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రాజకీయాలు పదవుల కోసం కాదు... సేవలు కోసం

ఆప్ కన్వీనర్ దయానంద్

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: రాజకీయాలను పదవుల కోసం కాకుండా సేవలుగా గుర్తించి నాయకులు పని చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె.దయానంద్ అన్నారు. బుధవారం స్థానిక పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ స్థాపించిన పదేళ్లలోనే జాతీయ పార్టీగా గుర్తింపు పొందడం ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల, కేజ్రీవాల్ నాయకత్వం పట్ల దేశ ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా దేశం కోసం మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లాలో పలు విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యదేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ, అధికారుల మెతక వైఖరిని నిరసిస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ ఒక పక్క ఎండలు విపరీతంగా ఉండగా విద్యార్థులకు ప్రభుత్వం చెప్తున్న ఒంటి పూట బడులు నిర్వహించకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతలు నిర్వహించడం అన్యాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయని, అందులో భాగంగానే ప్రతీ సంవత్సరం పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి, సిహెచ్ రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి దీవెన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు 283 మంది హాజరు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక శ్రీ వేంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో అరబిందో ఫార్మా జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌కి అరబిందో ఫార్మాసంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 283 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 171 మంది అరబిందో ఫార్మా కంపెనీలలో ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, శ్రీ వేంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధునీకరణ పనుల్లో భాగంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో ప్రజలకు సేవలు మరింత విస్తృతపరిచేందుకు ఆధునీకరణ పనులు చేపట్టినట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్డీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బ్లడ్ బ్యాంకులో పనిచేయుటకు అదనపు సిబ్బంది అవసరమైనందున టెక్నికల్ సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సస్, అకౌంటెంట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సింగరాయిలో ఫ్యామిలీ డాక్టర్

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామంలో బుధవారం వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ.ధరణి ఆధ్వర్యంలో వైయస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య సేవలు నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి 52 మంది రోగులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన గేదెల దేముడు జ్వరం,వాంతులు,విరోచనాలతో బాధపడుతుండగా వైద్యాధికారిణి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పీహెచ్సీకి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, డి.ఈ కే.మోహన్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం జే.వెంకటలక్ష్మి, సతీష్, ఆశా కార్యకర్తలు జే.రామలక్ష్మి, కె.ఎర్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టరు రమణ

విశాలాంధ్ర - పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలలో ప్రవేశానికి ఈనెల 24లోగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.డి.వి.రమణ తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరంలో చేరుటకు నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టర్లను బొబ్బిలి గురుకులం ప్రిన్సిపాల్, మన్యంజిల్లా కన్వీనర్ కె.రఘునాథ్‌తో కలిసి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖా దికారి డాక్టరు రమణ, కన్వీనర్ రఘునాథ్‌లు మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు ప్రామాణిక విద్యకు నిలయాలుగా కొనసాగుతున్నా యన్నారు. 5వతరగతిలో అన్ని సీట్లను, 6,7,8 తరగతులలో ఖాళీగా ఉండే సీట్లు ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. 5వ తరగతి నుండి ఇంట ర్మీడియట్, డిగ్రీ చదువుటకు ఆసక్తి గల విద్యార్థులు http://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈనెల 24లోగా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మే20న ప్రవేశ పరీక్షను అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని చెప్పారు. మే 20న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 5,6,7,8 తరగతులకు, మధ్యాహ్నం 2.20 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు జూనియర్, డిగ్రీ కళాశాలలకు ప్రవేశ పరీక్ష ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎంఇ.రమాజ్యోతి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇ.వి.ఎం గొడౌన్ ఏర్పాటుకు పరిశీలన

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇ.వి.ఎం) గొడౌన్ ఏర్పాటుకు భవనాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తో కలిసి బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్ద ఎం.ఎల్.ఎస్ పాయింట్ గోడౌన్ ను పరిశీలించారు. ఎం.ఎల్.ఎస్ పాయింట్ గోడౌన్ ను ఇతర భవనంలోకి మార్చి, ఆ భవనంలో ఇ.వి.ఎం గోడౌన్ ఏర్పాటుకు అవకాశాలు, అనుకూలతలు పరిశీలించారు. జిల్లాలో అన్ని వసతులు పూర్తి స్థాయిలో ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా వ్యవసాయ వాణిజ్య, రవాణా అధికారి ఎల్. అశోక్ కుమార్, తహశీల్దార్ శివన్నారాయణ పాల్గొన్నారు.

వచ్చే నెల 3లోగా బిల్లులు

సర్పంచ్‌లకు ఎమ్మెల్యే కడుబండి భరోసా

విశాలాంధ్ర-జామి: గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయ, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్‌ల బిల్లులను వచ్చే మే నెల 3వ తేదీలోగా ప్రభుత్వం విడుదల చేస్తుందని, ఈవిషయంలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారని ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్‌లో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయాల నిర్మాణంపై సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే వారికి తగిన భరోసాను ఇచ్చారు. వైఎస్ఆర్ ఆసరా అనేది అతిపెద్ద పథకమని, దానికి నిధులు సర్దుబాటు నిమిత్తం బిల్లులు ఆగాయని, ఇప్పుడు అంత పెద్ద పథకం సమీపంలో చెల్లింపులు లేవని అన్నారు. దీనిపై మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు మాట్లాడుతూ కొంతమంది రైతులు సొసైటీగా ఏర్పడి తగిన కుటీర పరిశ్రమలు నెలకొల్పితే బాగుటుందని వివరించారు. ఈసమావేశంలో జెడ్‌పిటిసి గొర్లె సరయుతోపాటు వైస్ఎంపిపిలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఎంపిడివో ఎం.సతీష్, తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్‌తోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమాలి మామిడి తాండ్రకు జి.ఐ టాగ్ అవసరం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఎల్.కోట మండలం భీమాలి గ్రామం మామిడి తాండ్రకు ప్రసిద్ధి అని చిన్న పిల్లలనుండి పెద్దల వరకు తాండ్రను తినడానికి ఇష్టపడతారని కానీ ఆశించిన స్థాయి లో దీనికి గుర్తింపు రాలేదనే చెప్పాలని ఈ తాండ్ర వ్యాపారానికి అవసరమైన వ్యాపార మెళకువలు, బ్రాండింగ్, నాణ్యత మరియు స్టోరేజ్ సౌకర్యాలను పెంచినట్లయితే భీమాలి తండ్రకి జియోగ్రాఫికల్ ఇండికేషన్ తీసుకురావచ్చని తద్వారా మంచి లాభాలని పేరుని పొందవచ్చని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని అన్నారు. బుధవారం విశ్వ విద్యాలయంలో ప్రాస్పెక్టస్ అండ్ ప్రాబ్లెమ్స్ అఫ్ మాంగో జెల్లీ బిజినెస్ అనే అంశంలో జరిగిన ఒక రోజు వర్క్‌షాపులో భాగంగా ఆయన మాట్లాడారు. అనంతరం డి ఆర్ డి ఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సావిత్రి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కళింగ వర్ధన్, అంబికా స్వీట్స్ సీఈఓ శ్రీనివాస్ భీమాలి సర్పంచ్ కృష్ణ మామిడి తాండ్ర తయారీకి సంభందించిన సమస్యలు, వ్యాపారానికి సంభందించిన వివిధ సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జితేంద్ర మోహన్ మిశ్రా కన్వీనర్‌గా, డాక్టర్ ఎన్‌వివిఎస్ సూర్యనారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు.

కాలువలలో పూడిక తీత

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని పాత బగ్గాం గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ లంక పద్మావతి ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో గల ప్రధాన కాలువలలో పూడిక తీత పనులు చేయడం వల్ల మురిగినీరు నిల్వ లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లంక చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం ముషిడిపల్లి గ్రామం జంక్షన్ వద్ద సచివాలయ సిబ్బంది, స్థానికులు, ప్రజా ప్రతినిధులచే ఏర్పాటు చేయబడిన ఉచిత మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పాదచారులు, ప్రయాణికులకు అవసరమైన చలివేంద్రాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, అధికారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సొలుబొంగు దారప్ప, మాజీ సర్పంచులు సత్యారావు, సన్యాసిరావు, సొలుబొంగు కనకం, నాయకుడు బుదరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి బూడిని కలిసిన డీసీసీబీ చైర్మన్

విశాలాంధ్ర - వేపాడ: విజయనగరం జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఆయన స్వగ్రామం తారువలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేపాడ మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే కొత్తవలస -దేవరాపల్లి రోడ్డులో అసంపూర్తిగా మిగిలిపోయిన ఆనందపురం -శే ఆర్ పేట మధ్యలోగల సుమారు 800 మీటర్ల పొడవుగల రోడ్డును త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలని చిన రామునాయుడు మంత్రి బూడిని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సీతంపేట కొత్త ప్రాజెక్టు అధికారి

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లా సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కల్పనా కుమారి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసారు. 2018 ఐఏఎస్ బ్యాచుకు చెందిన కల్పనా కుమారి అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

గడప గడపకూ అపూర్వ ఆదరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మండలం కొండకరకాం గ్రామంలో రెండో రోజు బుధవారం చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఏపీ శాసనసభ ఉప సభాపతి, నియోజకవర్గ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాల మంజూరులో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను వివరించారు. గత ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్నా, ఏ పని జరగాలన్నా లంచం ఇస్తేనే గానీ అయ్యేది కాదని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్ర స్వామిని, జగన్ ను ముఖ్యమంత్రిగా చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, తహసిల్దార్ బంగార్రాజు, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

విజయపథం ప్రచార రథం ప్రారంభం



విశాలాంధ్ర - బొబ్బిలి: 2024లో జరగబోవు సార్వత్రిక ఎలక్షన్స్ నిమిత్తం బొబ్బిలి నియోజకవర్గం స్థాయిలో టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన విజయపథం ప్రచారరథం ప్రారంభించారు. పట్టణంలో శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం వద్ద స్వామివారి ఆశీస్సులతో వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి ఆలయం వద్ద విజయపథం ప్రచారరథంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర - రేగిడి: విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం వావిలవలస గ్రామానికి చెందిన అన్నదాన సత్ర సభ్యురాలు అనాధ అయిన గండి అసిరమ్మ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈమెకు భర్త, పిల్లలు ఎవరూ లేరు. అనాధగా జీవిస్తోంది. ఆమె క్రిస్టియన్ కావడంతో క్రిస్టియన్ ఆచార సాంప్రదాయాల ప్రకారం అన్నదాన సత్ర నిర్వాహకులు సామాజిక కార్యకర్త పాలూర్ సిద్ధార్థతో పాటు కొంతమంది యువకులు అసిరమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - బెలగాం : ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. బగాది జగన్నాథరావు కోరారు. బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా బయటకు రావడం తగ్గించాలని, ఇంటి వద్దనే ఉండాలని అన్నారు. అత్యవసర సమయంలో బయటకు పనికి వెళ్ళే వారు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 వరకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండే సూచనలు ఉన్నందున ఆ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండటం మంచిదని అన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం కలిపిన నీళ్లు, కొబ్బరి నీళ్లు, పళ్ళ రసాలు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని అన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట ఐటిడిఏ నూతన ప్రాజెక్ట్ అధికారిగా బుధవారం కల్పనకుమారి ఐఏఎస్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని, గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించుటకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. పిఓను ఐటిడిఏ అధికారులు అంత కలిసి పరిచయం చేసుకున్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ

విశాలాంధ్ర - వంగర: రాజాంలో నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన విభిన్న ప్రతిభవంతులందరికీ ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ శిబిరానికి వంగర, రేగిడి, సంతకవిటి, రాజాం మండలాల్లో ఉన్న వివిధ రకాల అంగవైకల్యం గల వారందరూ అక్కడకు చేరుకోవాలన్నారు.

దుర్గాలమ్మ పండగ కోసం దబ్బిరాజుపేట ముస్తాబు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో పారిశుధ్యం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అలాగే గ్రామంలోని సీసీ రోడ్లను కూడా పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 25న కడు వైభవంగా జరగనున్న శ్రీ దుర్గాలమ్మ తల్లి నెల పండగకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందస్తుగా గ్రామసర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ పారిశుధ్య పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు.

నియోజక వర్గ టీడీపీ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిల సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం: స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజక వర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలతోపాటు పార్వతీపురం పట్టణ క్లస్టర్ యూనిట్ ఇన్చార్జీలతో సమావేశంను నిర్వహించారు. ఈసమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శాసనమండలి మాజీ సభ్యులు ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ పరిశీలకులు బోయిన గోవిందరాజులు, నియోజక వర్గం ఇంచార్జి, మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పాల్గొని పార్టీ బలోపేతం గూర్చి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించపోవడంతో పార్టీ చేస్తున్న చాలాకార్యక్రమాలు కేంద్ర,రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నమోదు జరగడం లేదన్నారు. ఇటువంటి అంశాలను సరిచేయాలని క్లస్టర్ ఇంచార్జిలు నియోజక వర్గ ఇంచార్జికు సూచించారు. గతంలో జరిగిన పరిణామాలు పునరావృతం కాకుండా మేనెల 27,28, 29 తేదీల్లో జరగనున్న మహానాడుకు పెద్దఎత్తున తరలివెళ్ళే విధంగా నియోజకవర్గ ఇంచార్జి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుంట్రెడ్డి రవికుమార్, సీతానగరం మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి తిరుపతిరావు, పట్టణ కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, తాతపూడి వెంకటరావు, కోలా సరితమధుసూధనరావు, పార్టీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, కోలాబాబు,బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగంతో రైతులకు అధిక ఆదాయం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగమైన పాడి పశువులు, కోళ్లు, జీవాల పెంపకం వంటివి చేపట్టడం వలన రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని బెంగళూరు శాస్త్రవేత్తలు ఎస్.ఎన్.ఎల్.సుశీల్, డాక్టర్ కె.శ్రీదేవితో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వెల్లడించారు. ఎస్.కోట మండలం బొడ్డవర రైతు భరోసా కేంద్రం పరిధిలో, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెంగుళూరులోని ఐ.సి.ఏ.ఆర్ - ఎన్.బి.ఐ.ఏ.ఆర్ ల సమన్వయంతో వ్యవసాయ పరిశోధనా కేంద్రం, విజయనగరం (ఏరువాక కేంద్రం) పరిధిలోని రెండు వందల వరకు భాగస్వామ్య గిరిజన కుటుంబాలతో, సమగ్ర వ్యవసాయ పద్ధతులపై బుధవారం సాయంత్రం జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘురాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సన్న, చిన్నకారు రైతాంగానికి వ్యవసాయ, వాటి అనుబంధ రంగాలైన పాడి, లేగదూడలు, కోళ్ళు, జీవాల పెంపకం చేపట్టడం వలన అధిక ఆదాయం పొందవచ్చని తెలియజేసారు. రైతులకు చిరుధాన్య విత్తనాలు, మేకలు, వనశ్రీ కోళ్ళు, డ్యూప్లెక్స్ కోడి గూళ్ళు, జీడి మామిడి అంట్లు, కూరగాయల విత్తనములు, గిరిజన రైతులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీనా, ఎం.పి.టి.సి లక్ష్మి, నాయకులు మురళీరాజు, కేతా వీరన్న, సన్యాసిదేముడు, బెంగుళూరుకు చెందిన శాస్త్రవేత్తలు డా.ఎస్.ఎన్.సుశీల్, డా.కె.శ్రీదేవి, అనకాపల్లికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డా.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

మే 1న పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం మే 1వ తేదీన నిర్వహించి ఆ రోజున అమ్మవారిని వనం గుడి నుండి చదురు గుడికి తీసుకువచ్చే కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.ఎల్.సుధారాణి వెల్లడించారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులతో కలిసి అమ్మవారి కళ్యాణ మంటపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1వ తేదీన సాయంత్రం 4-00 గంటలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం వనం గుడి నుండి అమ్మవారు బయలుదేరి హుకుంపేటలో గల ఆలయ పూజారి ఇంటికి చేరుకుంటారని, రాత్రి 10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 2వ తేదీ ఉదయం 6-30 గంటలకు మూడు లాంతర్లు వద్ద నున్న చదురు గుడికి చేరుకుంటారని తెలిపారు. ఈ ఉత్సవానికి సంబంధించి ఆలయ తలయారీ ద్వారా ఈ నెల 24న చాటింపు వేయిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు పతివాడ వెంకట రావు, ఎం.కే.బి.శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, గంధం లావణ్య, ఎస్.అచ్చి రెడ్డి, చిల్లా పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: తాటిపూడి వద్ద గల ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి పాఠశాలలో 5,6,7,8 తరగతులతో పాటూ జూనియర్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గానూ అర్హత గల అభ్యర్థుల నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఆర్జేసీ తాటిపూడి ప్రిన్సిపల్, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి శారదాబాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు ఉత్తర్వుల మేరకు మే 20న నిర్వహించనున్న ప్రవేశపరీక్ష కొరకు ఈనెల 24 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నామని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 సంవత్సరంలో 4,5,6,7 తరగతిలో ఉత్తీర్ణలై ఉండాలని, ఇంటర్ ప్రవేశనికి 10 పరీక్షలు, డిగ్రీ కొరకు ఇంటర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. https://aprs.apcfss.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9866559729ను సంప్రదించాలని ఆమె కోరారు.

కమ్యూనిస్టు యోధుడు మాకినేని

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సీపీఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పేదల పక్ష పాతి, తెలంగాణా పోరాట యోధుడు, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ నేతగా, సిద్ధాంత కర్తగా నిరంతరం భారతదేశం లో సమసమాజం స్థాపనకు కృషి చేసిన మహనీయుడు కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య ని ఆయన ఆశయ సాధన కోసం నేటితరం కృషి చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలో ఎల్ బి జి భవన్ లో జరిగిన మాకినేని బసవపున్నయ్య 31 వ వర్ధంతి సభలో మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవీ రమణ, అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ , సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ, ఆర్. ఆనంద్, వెంకటేష్, వి. లక్ష్మి తది తరులు పాల్గొన్నారు

నిజాయితీ ఎంఈఓపై ఫిర్యాదులు సరికాదు

విశాలాంధ్ర - బెలగాం : పి.ఆర్.టి.యు పార్వతీపురం మండల శాఖ అత్యవసర సమావేశం మండల శాఖ ఉపాధ్యక్షులు వసంత నాయుడు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి లక్ష్ము నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా హాజరైన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ, జిల్లా ప్రదాన కార్యదర్శి కాగాన విజయ్ మాట్లాడుతూ నిజాయితీగా తన పని తాను చేసుకుంటూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తున్న మండల విద్యాశాఖ అధికారిపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్దతి కాదని సోదర సంఘాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుల్ల రామినాయుడు, పెంట గోపాలకృష్ణ, జోగి నాయుడు, బి. శ్రీను, ఎం. శ్రీను, నిరంజన్, గౌరవ అధ్యక్షులు తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని సచివాలయ ఇంజిరీంఇగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.నాగమణిపై జామి ఎంపిటిసి-2 వేసలపు వరలక్ష్మి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు లిఖిత పూర్వక పిర్యాదును అందజేసారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగమణి తన ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఇళ్ళను మంజూరు చేస్తున్నా, ఆమె మాత్రం తనకు నచ్చితే లబ్ధిదారులకు మంజూరు చేస్తోందని ఆరోపించారు. నిరక్షరాస్యులైన లబ్ధిదారులతో ఎక్కడ బడితే అక్కడ సంతకాలు తీసుకుని వారిని మోసం చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిల్లులు పడిన వెంటనే తమ వాటాలుగా కొంత నగదును లబ్ధిదారులనుంచి గతంలో పనిచేసిన హౌసింగ్ ఎఇ, వర్క్ఇన్స్‌పెక్టర్‌లతో కలిసి అక్రమ వసూళ్ళకు పాల్పడ్డారని ఫిర్యాదులో తెలిపారు. ఈమెపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో లబ్ధిదారులు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తక్షణమే విచారణ చేసి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విచారణ చేయాలని ఎంపిడివో ఎం. సతీష్‌ను ఆదేశించారు.

శిలాఫలకం ధ్వంసం

విశాలాంధ్ర-జామి : మండలంలోని రామభద్రపుర అగ్రహారం పంచాయతీ పరిదిలోని కిర్ల గ్రామ సమీపంలో కిర్ల మెరకకు వెళ్ళే అమదారిలో ఉన్న శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం ద్వంసం చేసారని గ్రామ టీడీపీ అధ్యక్షుడు యర్ర కృష్ణ ఆరోపించారు. ఎల్‌కోట-అలమండ సంత రైల్వే స్టేషన్ రోడ్‌నుంచి గుర్ల మెరకకు వెళ్ళేందుకు అక్కడి గ్రామ ప్రజలు కొన్ని తరాలుగా రహదారి సౌకర్యాం లేక తీవ్ర నరక యాతన అనుభవించారు. గతంలో కోళ్ళ లలితకుమారి ఎమ్మెల్యేగా ఉన్న 2014-19 సమయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగా ఉండగా పంచాయతీ రాజ్ నిధులు రూ.44లక్షలతో సిసి రోడ్‌ను నిర్మించారు. అందుకు సంభందించి శిలాపలకాన్ని ఆనాడు ఆవిష్కరించారు. కానీ మంగళవారం ఈ శిలాఫలకాన్ని ద్వంసం చేయడం పట్ల టీడీపీ శ్రేణులు ఆందోళణ వ్యక్తం చేసారు.

పోలవరం ఎడమకాలువ ఎస్.ఈ.ని కలిసిన రైతు నేతలు

విశాలాంధ్ర - వేపాడ: రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సూచనలపై బుధవారం రాజమండ్రిలో పోలవరం ఎడమ కాలువ ఎస్ ఈ ఏసుబాబును కలిసి వినతి పత్రం సమర్పించామని రైతు సంఘం నాయకులు, పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ చల్లా జగన్ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి కాలువ డిజైన్ మార్పు, రైతులు ఏవిధంగా నష్టపోయేది వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి రాంబాబు, సుజలస్రవంతి పోరాట కమిటీ గౌరవాధ్యక్షులు బోధంకి గౌరినాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారని రైతు నేత చల్లా జగన్ పాల్గొన్నారు.

14న అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం : బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.శశిధర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో 14న నిర్వహించే జయంతి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వివిధ సంఘాలనాయకులు పాల్గొంటారని తెలిపారు.

మాటల ప్రభుత్వం కాదు మాది చేతల ప్రభుత్వం

విశాలాంధ్ర - దత్తిరాజేరు: పోరలి సచివాలయ పరిధిలో గల దాసుపేట గ్రామంలో బుధవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. గజపతినగరం శాసన సభ్యులు బొత్స అప్పల నరసయ్య గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి రెండవసారి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, జేసిఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్ర పాల్గొన్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర, - శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట విశాఖ-అరకు ప్రధాన రహదారి పక్కన రెండు బ్యాగుల్లో ఉన్న 25కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు తెలిపారు. అనుమానాస్పదంగా రోడ్డు పక్కన రెండు బ్యాగులు ఉండగా పరిశీలించి స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తారకేశ్వరరావు వివరించారు.

మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని కలిసిన జిల్లా బీజేపీ అధ్యక్షులు

విశాలాంధ్ర - పార్వతీపురం: ఇటీవల బీజేపీలో చేరిన ఉమ్మడి ఆంధ్రరాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి బుదవారం విజయవాడలో మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మన్యం జిల్లాలో పార్టీ గూర్చి ఆయన వివరించామని తెలిపారు.

జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర - చీపురుపల్లి: పట్టణంలో జగనన్న మా నమ్మకం-జగనన్న మా భవిష్యత్ అనే కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జిల్లా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ పాల్గొని చీపురుపల్లి పట్టణంలో కొత్త అగ్రహారం చెరువు గట్టు లైన్‌లో పర్యటించి పథకాలను వివరించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, శ్రీనివాస్, జిల్లా టెలికాం బోర్డ్ సభ్యులు ఇప్పిలి తిరుమల, చీపురుపల్లి పట్టణ పార్టీ నాయకులు పతివాడ రాజారావు, దాలయ్య, వార్డు మెంబర్లు మహంతి లక్ష్మి, ఇప్పిలి కృష్ణ, సచివాలయ కన్వీనర్ బలగ రమేష్, వైసీపీ నాయకులు మహంతి లక్ష్మణరావు, పల్లి రాజారావు పాల్గొన్నారు.

గ్రామదేవతను దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో బుఎవారం కాలరాజుపేట గ్రామం లో గ్రామ దేవత పండగ జరుగుతున్నందున గ్రామ దేవత పండగ కు బొబ్బిలి ఎమ్మెల్యే సంబంగి వెంకట చిన్నప్పల నాయుడు వచ్చి గ్రామ దేవతను దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమణ మూర్తి , జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు,వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచ్ లు వైఎస్సార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై దాడి: గాయాలు

విశాలాంధ్ర -బెలగాం : మహిళపై దాడి చేయడంతో మహిళలకు గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన తిర్లింగి లక్ష్మి ఏప్రశాంతి కూలి పని చేసుకొని ఉంటుంది. గ్రామ దేవత పండుగ జరుగుచుండగా బుధవారం మధ్యాహ్నం పోతన్న గుడి వద్ద తిర్లింగి అప్పలస్వామి విషయంలో గొడవ జరిగి ఇంటికి చేసుకున్నారు. సాయంత్రం అరసాడ శ్రీను, అరసాడ రమేష్ లు ఈ గొడవకు సంబందంలేకపోయినా లక్ష్మి ఇంటికి వచ్చి భర్త నరేశ్ తో గొడవకు దిగారు. దీనితో నా భర్త తో మీరు గొడవ ఎందుకు పడతారని అడుగగా శ్రీను, రమేష్ లు లక్ష్మిని కాళ్లతో తన్ని కొట్టడంతో కవుకు గాయాలయ్యాయి. దీనితో ఆమె భర్త 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కళావతి తమ్ముడికి నివాళులు అర్పించిన డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర -పాలకొండ: స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి సోదరుడు లక్ష్మణరావు మృతిచెందడంతో విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రి పీడిక రాజన్నదొర బుధవారం వండవ గ్రామంలో లక్ష్మణరావు పార్థివ దేహాన్ని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ పి. విక్రాంత్, వీరఘట్టం ఎంపీపీలు డి. వెంకటరమణ, బి. భాను, చైర్‌పర్సన్ వై. రాధాకుమారి, వైస్ ఎంపీపీ అనీల్‌కుమార్, సూర్యప్రకాష్, ఏపీపీ చందక జగదీష్, వి. దవళేశ్వరరావు, వైసీపీ పట్టణాధ్యక్షులు వి. మన్మధరావు, పూర్వపు కమిషనర్ ఎల్. పుష్పనాధం, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపు భీమ్ యువత ఆద్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర -జామి: డా. బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాలను పురస్కరించకుని ఈనెల 14న జామి మండల భీమ్ యువత ఆద్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు దళిత, గిరిజన ఐక్యవేదిక ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ నేతేటి కృష్ణారావు తెలిపారు. దీనికి సంభందించిన కరపత్రాల ఆవిష్కరణ జామిలో బుధవారం నిర్వహించారు. రాజ్యాంగ బద్దంగా యువతకు బహుజనులకు దక్కాల్సిన హక్కులను తిరిగి సాదించుకునేందుకు ఈర్యాలీ నాంది కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నేతేటి సంతోష్, అప్పలరాజు, కె.రామారావు(చింతాడ), బి.గణేష్ (జాగరం), పి.బంగారయ్య(లక్ష్మీపురం) కొట్యాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనస్సులో ఉన్న టీడీపీని ధ్వంసం చేయలేరు

విశాలాంధ్ర-జామి: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు అక్కడి శిలాఫలకాలే సాక్ష్యాలని, వాటిని ద్వంసం చేసినంత మాత్రాన ప్రజల మనసులో తెలుగుదేశంపార్టీకి, తనకుటుంబానికి ఉన్న ఆధరణ తగ్గిపోదని ఎస్కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి తెలిపారు. జామి మండలంలోని కిర్ల మెరక వద్ద శిలాఫలకాన్ని ద్వంసం చేయడంపై ఆమె స్పందించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని తగిన అభివృద్ధి కార్యక్రమాలను చేసేందుకు తాము నిత్యం కృషి చేశామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలనేవి ఇలా శిలాఫలకాలను ద్వంసం చేస్తే రద్దయి పోవన్నారు. ప్రజల గుండెల్లో నిత్యం తాము చేసిన సేవలను స్మరించుకుంటారన్నారు. ఇటువంటి నీచమైన పనులు ఎవరు చేసిన ఖండించాలన్నారు.

పురిటిపెంటలో జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని పురిటి పెంట గ్రామపంచాయతీ మామిడి బండ కాలనీలో జగన్ అన్నే నా భవిష్యత్తు అనే కార్యక్రమం చేపట్టారు. బుధవారం కాలనీకి చెందిన గృహ సారధులు గజ్జల రాము, కె కుమార్ ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ అరుణ వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

విశాలాంధ్ర - గరుగుబిల్లి/పార్వతీపురం: భూసార పరీక్షలపై, మట్టి నమూనా సేకరణ, ఎరువుల వినియోగం గూర్చి తోటపల్లి జట్టు సంస్థ ప్రాంగణంలో అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్ విచ్చేసి భూసార పరీక్షలపై, మట్టి నమూనా సేకరణ గూర్చి, సమతుల్యం గూర్చి వివరించారు. భూసార పరీక్షలకు సంబందించి మట్టి నమూనాల సేకరణపై డిమాన్స్ట్రేషన్ చేయించారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా శిక్షణ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడిఏ కె.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనీ బి.శారద, నాలుగు సబ్ డివిజన్ ఏడిఏలు, ప్రకృతి వ్యవసాయ డిపిఎం, రైతుభరోసా కేంద్రాల విఏఏలు, జట్టు సంస్థ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు కొమరాడ,మక్కువ, భామిని తదితర 8మండలాల్లో 603మంది రైతులకు చెందిన 213.5హెక్టార్ల పంట నష్టం జరిగిందని విలేకరులకు తెలిపారు.

మండలానికి ఎనిమిది డీఎస్సీ పోస్టులు భర్తీ

విశాలాంధ్ర - సీతానగరం: 25ఏళ్ల తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి 1998 డి.ఎస్సీ అభ్యర్థులకు మోక్షం కల్పించి బుదవారం వారికి ఉత్తర్వులు అందజేసారు.మండలానికి ఎనిమిది మందిని కేటాయించారని మండల విద్యా శాఖాధికారి జి. సూరిదేముడు తెలిపారు.గురువారం ఈఎనిమిది మంది విధుల్లో చేరనున్నారు. వెంకటపురం(ఏ), వెంకటపురం(ఎన్), అనంతరాయుడుపేట, వెన్నెల బుచ్చెమ్మపేట, కాసాపేట, నీలకంఠా పురం, చిన్నారాయుడుపేట, దయానిధిపురం గ్రామాల పాఠశాలలలో వీరిని నియమిస్తూ జిల్లావిద్యా శాఖాధికారి ఉత్తర్వులు జారీచేశారని చెప్పారు. ఇదిలా ఉండగా అంటిపేట పంచాయతీ సర్పంచ్ సిరికి మహేష్ 1998 డిఎస్సీలో ఎంపికై మండలంలోని అనంతరాయుడుపేటలో నేడు జాయిన్ అయ్యాక తన సర్పంచ్ పదవికి గురువారం రాజీనామా చేస్తానని చెప్పారు.

మా భవిష్యత్.. మానమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర -పాలకొండ: పట్టణ పరిధిలో మా భవిష్యత్.. మానమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం బుధవారం గడప గడపకు నిర్వహించారు. ఈ కార్యక్రమం 9నెం. బాసూరువారి వీధి సచివాలయ పరిధిలో 13, 18 వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. వైసీపీ పట్టణాధ్యక్షులు, 5వ వార్డు కౌన్సిలర్ వి. మన్మధరావు, అర్బన్ కన్వీనర్ కోడెం విజయ్‌కుమార్ (బాబి), 13,18 వార్డుల కన్వీనర్‌లు పి.కృష్ణ కుమార్, కిల్లారి మోహనరావు (కౌన్సిలర్), 13వ వార్డు కౌన్సిలర్ బాసూరు కాంతారావుల ఆద్వర్యంలో నిర్వహించారు. గురువుగారివీధి, బాసూరువీధి, నెయ్యిల వీధిలో ఇంటింటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో గృహ సారధులు కె. నారాయణరావు, టి.వాసుదేవరావు, బెహరా గోవర్ధనరావు, సిద్ధాంతం సత్యన్నారాయణ, వి.దామోదరరావు, పార్టీ సీనియర్ నాయకులు కె. వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు బి. దుర్గారావు, డా. వి. చంద్రమౌళి, శ్రీనివాసరావు, పి. దుర్గారావు, టి. రామకృష్ణ, పి. శ్రీనివాసరావు, సత్యవతి, లలిత, ఆదిలక్ష్మి, పెద్దఎత్తున మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి 40 ఏళ్ళు వెనక్కి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : సీఎం జగన్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి 40 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శృంగవరపుకోట మండలం, శృంగవరపుకోట కోటవీధి, ప్రకాశం మార్కెట్ ఏరియాల్లో శృంగవరపుకోట పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 సంవత్సరంలో టీడీపీని గెలిపించి చంద్రబాబు నాయుడు సీఎం అయ్యేవరకు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, ఎస్.కోట గ్రామ కమిటీ పార్టీ అధ్యక్షులు కె.మల్లీశ్వరరావు, పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), వార్డు మెంబర్ సరిపల్లి రామకృష్ణ, విశాఖ టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, ఐటీడిపి రాష్ట్ర సెక్రెటరీ చెక్కా కిరణ్ కుమార్, ఐటీడీపీ నియోజకవర్గ సెక్రెటరీ అనకాపల్లి చెల్లయ్య, మాజీ ఎంపీటీసీ బిశెట్టి అరుణ, మాజీ ఎంపీటీసీ గొర్ల కన్నతల్లి, టీడీపీ సీనియర్ నాయకులు మోపాడ చిన్నికృష్ణ, సిండికేట్ సుబ్బారావు, కరివేపాకు రాజు తదితరులు పాల్గొన్నారు.